# నిప్పు

"దిసీజ్ టూ మచ్ ! !"

సరస్వతీ మేడం గొంతు ఆ విశాలమైన క్లాసు రూములోని గ్యాలరీ పైమెట్లు మీద ఖంగుమని మ్రోగి, ప్రతిధ్వనించింది...

ఆమె ఎదురుగా నిలబడ్డ నాగరాజు తల సిగ్నల్ రెక్కలా వాలి ఉంది. వాడి మొహం పడమటకు వాటారుతూన్న సూర్యబింబంలా ఉంది. చొక్కా బొత్తాలు పెట్టుకోకుండా కేర్‌లెస్‌గా వదిలిపెట్టిన ఛాతీ తాలూకు పొగ చొరిన ఎముకల గూడు సముద్ర కెరటంలా ఎగిరెగిరి పడ్తోంది. ముందున్న డెస్కు చివర అంచుదగ్గర, కోపంతో అవమానంతో వణకుతూన్న వాడి చేతివ్రేళ్ల మధ్య, నిర్భయంగా నిర్లక్ష్యంగా కాలుతూనే ఉంది, గోల్డ్ ఫ్లేక్ సిగరెట్. లోపల డెస్కులో తెరచి ఉంచిన సెక్స్ పుస్తకం లోంచి నగ్నసుందరి అస్తవ్యస్తంగా పడుకుని నవ్వుతూనే ఉంది....

బరువుగా, కోపంగా నిట్టూర్చుతూ అంది మేడం, "చదువంటేనూ, క్లాస్ రూం అంటేనూ ఇంత నిర్లక్ష్యమన్నమాట నీకు ! ఎప్పుడో నెలకోసారి క్లాసుకు రావడం, ఆ వచ్చిన రోజున ఇలా క్లాసులో సిగరెట్ తాగుతూ చెత్తపుస్తకాలు చదవడం ఓ పెద్ద హీరోయిజం అనుకుంటున్నావన్నమాట. ఇటీజ్ రియల్లీ షేమ్ ఆన్ యువర్ పార్ట్... సిగ్గు పడాలయ్యా... సిగ్గు పడాలి...." ఆగి, వాడి మొహంలోకి చూస్తూ, కోపం కంట్రోల్ చేసుకోవడానికి ప్రయత్నించి, సాధ్యం కాక దృష్టిని క్లాస్‌వైపు తిప్పింది మేడం...

నిశ్శబ్దం....

దరిదాపు అరవై జీవాలు - పీల్చుకున్న గాలిని వదలడానికి ధైర్యం చాలక, ఉగ్గబట్టి, ఉక్కిరిబిక్కిరి అవుతూ, నిశ్శబ్దంగా వింటున్నాయి....

"...పండిత బ్రహ్మేశ్వర శాస్త్రిగారి పేరు చెబ్తేనే ఊళ్ళో ఎంతటి పెద్ద మనిషయినా లేచి, సవినయంగా తల వంచి, నమస్కరిస్తాడు. అటువంటి మహాపండితుడి కొడుకు... హవ్వ.... పండితపుత్రః ... తెలుసుగా?... ఆరెన్ట్‌యు ఎషేమ్డ్ ఆఫ్ యువర్ సెల్ఫ్ మిష్టర్?..." అసహనం, అసహ్యం ధ్వనిస్తోంది ఆమె గొంతులో...

మళ్ళీ నిశ్శబ్దం - భయం గొల్పే నిశ్శబ్దం... ! !

గాలి సైతం ఏదో కీడుని శంకించిన దానిలా స్తంభించి వింటోంది......

"...మీ అక్కయ్య జ్యోతి పేరు చెబ్తే ఇప్పటికీ కాలేజీ స్టాఫ్ యావత్తూ గర్వంతో తలెత్తుతారు - 'షీ వజ్ ఫ్రమ్ అవర్ కాలేజ్' అంటూ. అంత బ్రిలియంట్ స్టూడెంట్ ఆమె - ఈ కాలేజీకి స్టేట్ లెవెల్లో పేరు తెచ్చి పెట్టింది జ్యోతి. ఆమెకి తమ్ముడివా నువ్వు? ! అన్‌బిలీవబుల్ ! !... ఈ పాటికి గ్రాడ్యుయేషన్ కంప్లీట్ చెయ్యాల్సిన వాడివి, హుఁ, ఇంత చక్కగా చదువు వెలగబెడ్తూ ఇంకా ఇంటర్లో ఉన్నావు..." వాడి మొహంలోకే సూటిగా తీవ్రంగా చూస్తూ, మాట్లాడుతోంది మేడం....

నాగరాజు మొహం ఎరుపులోంచి నలుపులోకి మారుతోంది. కళ్ళల్లో ఎఱ్ఱజీరలు కదులుతున్నాయి. తల మరింత వాలింది....

"ఈ హీరోయిజం ఇమేజ్ అనేది ఉంది చూశావు - ఇది శాశ్వతం కాదు మిస్టర్ ! నిన్ను ఈ రోజు హీరోగా పొగిడిన నోళ్లే ఓ రోజున నిన్ను చూసి నవ్వే రోజు వస్తుంది. వేకప్ ఇమ్మీడియట్లీ ! ఈ చెత్తపన్లు కాదు హీరోయిజం అంటే - ఎవ్వరూ చెయ్యని, చెయ్యలేని గొప్ప పని చేసి చూపించు - అదీ హీరోయిజం అంటే ! అండర్‌స్టాండ్? ఇక ముందు ఇలా మాత్రం బిహేవ్ చెయ్యొద్దు - నోలాంగర్ దిస్ టైప్ ఆఫ్‌బిహేవియర్ విల్‌బి టాలరేటెడ్ - మైండిట్...."

విసురుగా, వెనుతిరిగి, టకటకా క్రిందకు నడిచి, "నో మోర్ క్లాస్ టుడే" అని బయటకు నడిచింది సరస్వతీ మేడం.

ఆవిడ క్లాసు రూము దాటగానే అరవై మంది ఒక్కసారిగా నిశ్వాసించిన గాలి - చదువుల తల్లి వేడి నిట్టూర్పులా 'హుంంంమ్...' అని ధ్వనించింది. మరో నిముషానికి ఒక్కొక్కరే నిశ్శబ్దంగా నెమ్మదిగా లేచి బయటకు నడుస్తున్నారు...

నాగరాజు అలాగే ఎగిసిపడుతూన్న గుండెలతో, మండుతూన్న కళ్ళతో, తలవంచుకునే నిలబడి ఉన్నాడు. ఎవ్వరూ అతగాడి దగ్గరకు రాలేదు. వాడిని హీరో అంటూ పొగిడే సత్తిబాబు గాని, వాడితో షికార్లకీ, సినిమాలకీ రాసుకు పూసుకు తిరగాలని ఉబలాటపడే పంకజవల్లి గానీ... ఎవ్వరూ...ఎగిసిపడుతూన్న గుండెలతో బాటే గిట్ట కరిచిన పళ్ల క్రిందన దవడ ఎముక కూడా కదుల్తోంది... చివరంటా కాలిన సిగరెట్ నిప్పు వ్రేళ్ళకి తగిలి చుర్రుమనడంతో ఉలిక్కిపడ్డ నాగరాజు నెమ్మదిగా త లెత్తి చుట్టూ చూశాడు - క్లాసంత ఖాళీగా ఉంది.

బరువు బరువుగా అంగలు వేస్తూ బయటకు నడిచాడు నాగరాజు. కోపంతోనూ, అవమానంతోనూ మనిషి తూలి పోతున్నాడు. చెట్లదగ్గర, వరండాలో, సైకిల్‌స్టాండ్ దగ్గర, వాలీబాల్ గ్రౌండ్‌లో... అంతా స్టూడెంట్లే... త ననే చూస్తున్నారు... కొందరు నవ్వుకుంటున్నట్లుగా కూడా ఉంది... ఇన్నాళ్లూ తను సంపాదించుకున్న హీరో ఇమేజ్ ఈ రోజుతో...

ఆవేశంతో ఊగిపోతూ గేటు దాటిన నాగరాజు ఎదురుగా ఉన్న కిళ్ళీకొట్టు దగ్గర కొచ్చాడు. వస్తూనే రెండు సోడాబుడ్లు అందుకుని చంకల్లో ఇరికించుకుని, మరో నాలుగు బుడ్లు పట్టుకుని, "ఏ...య్య్.." అంటూ అరుస్తూ కాలేజీ ఆవరణలోకి పరుగెత్తి, ఒక్కొక్క బుడ్డే పైకి గాలిలోకి ఎగరేస్తూ, దానిని మరో బుడ్డితో కొట్టి పగలగొడ్తూ, పెద్దగా రణకేకలు పెడ్తూ, చుట్టూవీరావేశంతో చూశాడు. కొన్ని పందల మంది స్టూడెంట్లు, కొందరు లెక్చరర్లు, కొందరు కాలేజీ ఆఫీస్ స్టాఫ్... బొమ్మల్లా, కళ్ళార్పకుండా, భయంభయంగా వాడినే చూస్తున్నారు. అందర్నీ కలియజూసి, ఒక్కరూ తన జోలికి రావడానికి సాహసించలేకపోయేసరికి, గర్వంగా ఓసారి త లెగరేసి, మోటార్ సైకిలెక్కి బయటకుదూసుకుపోయాడు.

"ఈవేళ అన్నయ్య అదోలా ఉన్నాడు - బాగా ఆవేశంగానూ, ఆందోళన గానూ కూడా ఉన్నాడు - కాలేజీలో ఏవఁన్నా గొడవ జరిగిందేవిటే అమ్మడూ?" కాలేజీ నుంచి అప్పుడే ఇంటి కొచ్చిన చిన్నకూతురు పద్మని ఆదుర్దాగా ప్రశ్నించారు శాస్త్రిగారు.

"ఆఁ వీడి ఘనకార్యాలు మరీ మితిమీరి పోతున్నాయి. అందరూ వీడికి భయపడి ఊరుకుంటారా ఏవిటీ?..." చేతిలోని పుస్తకాలని విసురుగా బల్ల మీద కొట్టి, విసవిసా వంటింట్లోకి నడిచింది పద్మ.

శాస్త్రిగార్లో కంగారు ఎక్కువ అయ్యింది.

"ఏఁవయ్యిందో చెప్పకుండా అల్లా పోతావేం తల్లీ?"

ఓ గ్లాసుడు మంచినీళ్లు గడగడ త్రాగి, కొంగుతో మూతి తుడుచుకుంటూ, వెళ్లిన విసురులోనే బయటకొస్తూ "సరస్వతీ మేడం ఈవేళ వీడిని చెప్పెట్టి కొట్టినట్లు మందలించార్ట. కాలేజీ అంతా చెప్పుకుంటున్నారు. వీడి సంగతేమో గాని, నాకు మట్టుకు చచ్చేంత సిగ్గేసింది వీడి చెల్లెల్ని

తులసి బాలకృష్ణ

అయినందుకు..." ఆ అమ్మాయి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

విషయం పూర్తిగా అర్థం కాని శాస్త్రిగారికి కంగారు, బాధ ఎక్కువ అయి, గొంతు పూడుకుపోయింది. సంగతి వివరంగా చెప్పమన్నట్లుగా అభ్యర్థిస్తున్నట్లు చూశారు కూతురు వైపు.

"ఎప్పుడూ క్లాసుకే సరిగా తగలడని వెధవ - ఈవాళ సరస్వతీ మేడం క్లాసులో వెనక సీట్లో కూర్చుని, దర్జాగా సిగరెట్... ...." ఎదురుగా గబాల్న తెరుచుకున్న తలుపుల వెనక ఉన్న అన్నగార్ని చూసి కొయ్యయిపోయి, భయంగా, అప్రయత్నంగా, "అ...న్న..య్య... ఇంట్లోనే ఉన్నాడా నాన్నా...?" అంది.

చెల్లెలి వైపు తీవ్రంగా చూస్తూ, గది బయట అడుగు పెట్టాడు నాగరాజు.

కొడుకు చూపులు గమనించిన శాస్త్రిగారు త్వరపడి, వాడికీ, ఆ పిల్లకీ మధ్యకి వచ్చి, జీవరహితమయిన నవ్వుతో, "అదికాదురా ఊరికే ఏం జరిగిందో చెబ్తోంది అంతే..." అంటున్నారు గాని, వాడు ఆయన్ని ప్రక్కకు నెట్టి, విసురుగా ముందుకొచ్చి, "...లేననుకుని వాగుతున్నావటే దేభ్యంముండా" అంటూ ఆమె జుట్టు అందుకుని, ఒంగదీసి, రెండు పిడిగుద్దులు గుద్ది' "ఇంకెప్పుడన్నా నా గురించి వాగావంటే చెయ్యో కాలో విరిచేసి, కుంటి ముండని చేసి ఇంట్లో పడేస్తాను జాగర్త..." అంటూ ఇంకా కోపం చల్లారక, ఆమె కళ్ళజోడుని లాగి నేలకేసి కొట్టి, "నీకు ఇదే శాస్తి గుడ్డిముండా" అని వినవిసా బయటకు నడిచాడు. మరో నిముషానికి మోటార్ సైకిల్ స్టార్టయింది.

పద్మ ఉన్నపాటున కూలబడి, రెండు చేతుల్లోనూ ముఖం దాచుకుని బావురుమంది.

శాస్త్రిగారు స్థాణువులా నిలబడిపోయారు.

కూతుర్ని ఓదార్చే శక్తి కూడా నశించిపోయింది.

కొడుకులో రోజురోజుకీ వస్తూన్న మార్పులకీ, చెడు ప్రవర్తనకీ మనసు కకావికలమై పోయి, నిలువెల్లా బాధతో వణికిపోతున్నారు. అల్లాగే కుర్చీలో కూలబడి, తల వెనక్కి వాల్చారు. యాంత్రికంగా చూస్తూన్న చూపులో ఎదురుగా గోడ మీదున్న ఫోటో పడింది.


పదమూడేళ్ళ క్రితం అది -

ఆ ఫోటోలో - తమ్ముడి భుజం మీదుగా ఆప్యాయంగా చేయి చుట్టి నవ్వుతూ చూస్తూన్న జ్యోతి, అక్క భారాన్నిమోస్తూన్న వాడిలా చిరాగ్గా కోపంగా చూస్తున్న నాగరాజు, కొంచెం ఎడంగా భయంభయంగా పద్మ...

జ్యోతి ! నిజంగా ఈ ఇంటి జ్యోతే ! 'మనింట్లో ఒక్కగా నొక్క మగ కుర్రాడు కద నాన్నా - తల్లి లేని కుర్రవెధవ, వాడి గారాం చెల్లకపోతే ఎలా?' అనే జ్యోతి,... పెళ్ళికి ముందు ఒప్పుకున్న ప్రకారం మోటార్ సైకిల్ తెస్తేనే కాపురానికి తీసుకు వెళ్తానంటూ భర్త ఇక్కడపుట్టింట్లో వదిలిపెట్టి వెళ్ళిపోతే, చిరుద్యోగం చేసి సకష్టపడి పోగుచేసిన డబ్బుని, తమ్ముడు సరదా పడ్డాడని వాడికి మోటార్ సైకిల్ కొనడానికి ఖర్చు చేసేసి, 'పోనీలే నాన్నా - నేను మరో రెండు సంవత్సరాలు ఆలస్యంగా కాపురానికి వెళ్తానంతే కదా' అని తేలిగ్గా నవ్వేసిన జ్యోతి,...

శాస్త్రిగారి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

ఆయన దృష్టి ప్రక్క ఫోటో మీదకి మళ్ళింది.



అందులో తన కుటుంబం మొత్తం ఉంది - తను, భార్య, జ్యోతి, పద్మా, వాడు... ఆయన చూపు భార్య మీదే నిలిచిపోయింది. మహాలక్ష్మి... పిచ్చిది...కొడుకంటే ఎంత ప్రేమని దానికి? ! ఓ అర్ధరాత్రి ... వాడు నిద్రలో ఎందుకో ఉలిక్కిపడి లేచి కూర్చుని, ఏడుపు మొదలు పెట్టి, ఎంత ఓదార్చినా వినక, తిక్క కొద్దీ కాఫీ కావాలని పేచీ పెడ్తే, నూటరెండు జ్వరంతో ఉండీ కూడా నిద్రపోతూన్న ఆడపిల్లలని లేపకుండా, తనే స్వయంగా కాఫీ పెడదామని వంటింట్లోకి వెళ్ళి, స్టౌవెలిగించి, నిలవలేక తూలి దాని మీద పడిపోయి, 'బాబు జాగర్తండీ' అంటూ తనకి అప్పగింతలు చెబ్తూ.... శాస్త్రిగారి కంటిరెప్పలు దాటి వస్తూన్న కన్నీటిని ఆపలేక పోయాయి.

తను మాత్రం - వాడిని ఎంత ప్రేమగా చూసుకుంటూ వస్తున్నాడని? అప్రయత్నంగానే ఆయన దృష్టి ఫోటోల ప్రక్కనే ఉన్న 'సన్మానపత్రం' మీద పడి, ఆయన పెదవుల మీద చిన్న నవ్వు కదిలింది. విచిత్రాతి విచిత్రమయిన సన్మానపత్రం అది. తనకు అనేక సన్మానాలు జరిగాయి. వాటిలో సన్మాన పత్రాలూ సమర్పించబడ్డాయి. అవన్నీ గోడల మీద ప్రదర్శించుకోలేదు తను. అటక ఎక్కించేశాడు. అయితే - ఇది - గోడ మీద ప్రదర్శిస్తున్నాడు - తనకు సన్మానమే జరక్కుండా, తను అసలు ఆ సభకే వెళ్లకుండా సమర్పించబడిన సన్మాన పత్రం అది. ఏదో చిలిపి కోరిక కోరి, ఆ కోర్కె తీర్చడానికి తను ఆలస్యం చేశాడని అలిగి, తన కొడుకు తనని గదిలో పెట్టి గొళ్ళెం పేట్టేసి, సన్మాన సభకువెళ్లకుండా చేసేస్తే - సమయం మించిపోతోందంటూ కంగారు పడ్తూ సన్మాన సంఘం వాళ్లు తన ఇంటి కొచ్చి, వరండాలో కూర్చుని ఆదుర్దా పడుతూంటే - తనకు విపరీతమయిన తలనొప్పిగా ఉన్న కారణంగా సభకి రాలేనని కూతురు ద్వారా వాళ్లకి కబురు పెడ్తే - నిరాశచెంది, అహంకారం కొద్దీ తను తప్పించుకుంటున్నాడని అపోహపడ్డ సన్మానసంఘం వాళ్లు - తనని మెత్తగా, పొగడ్తల రూపంలో వ్యంగ్యంగా చీవాట్లు పెడ్తూ రచించి, మర్నాడు తనకు 'అతివినయం'గా అందించిన 'సన్మానపత్రం' అది. ఆ రోజు సభని యథావిధిగా జరిపి, అందులో ఈ పత్రాన్ని చదివి, దీని కాపీలని కూడా ఊరంతా పంచి పెట్టారు. అయితే, తను గది దాటి బయటకు రానందుకు కొడుకు కళ్ళల్లో మెరిసిన గర్వం - తనని ముగ్ధుణ్ణి చేసేసి, ఈ అవమానాన్ని మరిపింపజేసింది. అయినా, అనేక మంది సాహితీ ప్రియులని బాధపెట్టినందుకు నిష్కృతిగా ఈ సన్మాన పత్రాన్ని తాను గోడ మీద ప్రదర్శిస్తున్నాడు ఆ రోజు నుంచీ...

పద్మ... అన్నగారు పలకరిస్తే పరవశించిపోతుంది. వాడి ముఖం మీద ఏమాత్రం ప్రసన్నత కనిపించినా 'అన్నయ్యా' అంటూ వాడిని అంటుకు తిరుగుతుంది.

ఇలా... ఇంట్లో ఎవ్వరూ వాడిని నొప్పించకుండా, అతి ప్రేమగా మసల్తూ వస్తున్నారే ! కాని, వాడు... ఇలా... ఇంట్లో వాళ్లకే కాదు.. ఊళ్లో వాళ్ళకి కూడా పెద్ద తలనొప్పిగా 'తయారై పోతున్నాడు. అనేకసార్లుపోలీసు రికార్డులలోకి కూడా ఎక్కాడు. వాడి కారణంగా తను అనేకసార్లు బూతులు తిట్టించుకున్నాడు. చివరకి... ఊరంతా... తమ కుటుంబాన్ని వెలివెయ్యరు కదా? !... దేవుడా ! ఏమిటీ శిక్ష మాకు? !

ఇదిగో
ఉత్తేజకరమైన
శక్తితో బట్టలను
ఉతికే హా

పై కప్పునే తదేకంగా రెప్పలు వాల్చకుండా చూస్తూన్న నాగరాజు కళ్ళు ఎఱ్ఱటి మాంసపు ముద్దలా ఉన్నాయి.

గొంతు దిగుతూన్న బ్రాందీ మండుతూన్న గుండెల్ని మరింత కాల్చుతోంది.

చేతిలో సిగరెట్ క్రమేపీ ఆహుతి అవుతోంది.

ఎదురుగా నాలుగు కళ్ళు వాడినే చూస్తున్నాయి.

ఆ చూపుల్లో ఆజ్ఞ కోసం ఎదురు చూపు ఉంది.

ఆ గదిలో చీకటి ఉంది.

ఆ మూడు గుండెల్లో మరింత చీకటి ఉంది.

"దొంగ...లం...ముం..." అని ఆగి, ఓ గుక్క ఆజ్యాన్ని తన గుండెలకి చేర్చి ఒగర్చాడు నాగరాజు.

"అవును..." అన్నాయి ఎదురుగా ఉన్న నోళ్ళు.

"చంపేస్తాను దాన్ని.."

"అల్లాగే... తప్పకుండా..." రెండు తలలూ ఊగాయి.

రెండు నిముషాలు నిశ్శబ్దం.

నాగరాజు వ్రేళ్ల మధ్య కాలిపోయిన సిగరెట్‌ని తీసేసి, మరోటి వెలిగించి పెట్టూ, అతి నెమ్మదిగా అంది ఓ శాల్తీ, "దాన్నేం చెయ్యమంటావో చెప్పు బాసూ...."

"చంపెయ్యాలీ!" నేల తన్ని అమాంతం లేచి, వినవిన ఇటు అటూ నడుస్తూ, "నన్ను.. నన్ను చూస్తేనే కాలేజీ స్టూడెంట్లందరూ గడగడ లాడిపోతారే... లెక్చరర్లందరూ ప్రిన్సిపాల్‌తో సహా వణికి ఛస్తారే... అల్లాంటిది... నన్ను... ఓ ఆడ లెక్చరరు... అవమానిస్తుందా? ఏవిటో ఆ టైంలో నా చేతులూ కాళ్లూ కట్టేసి నట్లయి ఏఁవీ తోచక తలొంచుకుని నిలబడిపోయాను! అదే ఇప్పుడయితేనా? ఎవ్వరూ చెయ్యని, చెయ్యలేని పని చేసి చూపించమని ఛాలెంజ్ చేసింది కదూ - చేసి చూపిస్తాను..." పళ్ళు పటపట లాడాయి.

"మర్డరే అయితే ఆ ఛాన్సు నా కొదిలెయ్ బాసూ - కాలేజీ గేటు దాటగానే దాన్ని ఖతం చేసి పారేస్తా" ఒకటో తల.

"ఆ - తర్వాత మన కేసఁన్నా అవుతుందేమోనన్న భయం కూడా అక్కర్లేదు నీకు. మా బావ ఎం.పి. కదా - మనల్ని ఢిల్లీలో దాచేసి, కేసు కొట్టేసే దాకా అక్కడే హేపీగా గడపమంటాడు.." రెండో తల.

నాగరాజు తల కసిగా ఊగింది.

"దాన్ని అలా ఇలా చంపకూడదురా - ఎవ్వరూ చెయ్యని, చెయ్యలేని గొప్ప పని చెయ్యాలిగా మరీ... అందుకనీ.. కొత్తరకంగా.. కొత్త చేట్లోనే.. చంపుదాం..."

ఎదురుగా ఉన్న ముఖాల్లో క్రొత్త ఉత్సాహం...

జేబులోంచి ఓ నాటు పిస్టల్ తీశాడు నాగరాజు. దానిని ప్రేమగా చూసి, అలవోకగా నవ్వి, "ఇది మా ప్రియతమ అక్క గారి ప్రెజెంటేషన్ - ఆవిడ ఇవ్వలేదు, మనమే పుచ్చుకున్నాం..." అంటూ చిన్నగా ముదలెట్టి, గట్టిగా నవ్వేసి, "వెర్రిముండ - రాత్రి అర్ధరాత్రి వరకూ నన్ను కూర్చోబెట్టి, నీతిబోధలు చేసింది. తెల్లారే సరికి దాని మెడ ఖాళీ. అది నిద్రలోకి జారాకఅతి నేర్పుగా దాని మెళ్ళోంచి కొట్టేసిన మంగళసూత్రం ఓల్డ్‌సిటీ యూకూబ్‌మియా చేతిలోకి - ఈ ముద్దుల పిస్టల్ మన చేతిలోకి. ఇకపోతే - ఈ పిస్టల్‌తో దాన్ని చంపుతాం అనుకుంటున్నారు కదూ మీరు? పొరబాటు - ఆ టైప్ ఆఫ్ మర్డర్ చాలా మందే చేశారు. ఇది కేవలం కొందర్ని బెదిరించడానికే..."

శ్రోతలు చెవులు రిక్కించి వింటున్నారు.

నస్పెన్సు భరించలేకపోతున్నారు.

నాగరాజు పచార్లు చేస్తున్నాడు.

శ్రోతలు ఊపిరి బిగపట్టి వాడినే చూస్తున్నారు.

నాగరాజు నడక ఆపి, ఒక్కసారిగా అరచినట్లు అన్నాడు, "మనం దాన్ని... క్లాసు రూములో... పాఠం చెబ్తూండగా... అందరూ చూస్తూండగా...నజీవ దహనం చేసి చంపుతాం!!




## పౌర్ణమి లేని నెల

1866 ఫిబ్రవరి ఖగోళ శాస్త్రపరంగా అత్యంత అరుదైన మాసం. ఆ నెలలో పూర్ణ చంద్రుడు కనుపించలేదు. అంతకుముందు జనవరిలోనూ, తరువాత మార్చిలోనూ రెండు పౌర్ణమిలు ఏర్పడ్డాయి. ఇలాంటి సంఘటన ప్రపంచ చరిత్రలోనే ఇంతకు ముం దెప్పుడూ ఏర్పడలేదని ఖగోళ శాస్త్రజ్ఞులు అంటున్నారు. మళ్ళీ దాదాపు 2,500,000 సంవత్సరాల వరకూ ఇలాంటి సంఘటన జరగదని కూడా అంటున్నారు.

వల్లాల సుషమ [బలపాల]

అదిరిపడ్డారు శ్రోత లిద్దరూ.

"యస్స ! ఎవ్వరూ చెయ్యని... చెయ్యలేని..నాగరాజు చెయ్యగలిగిన...ఘనకార్యం" " అని మళ్ళీ పచార్లు చేసి, ఆగి, కుర్చీలో కూర్చుని, "ఈ ఘనకార్యంలో మీ ఇద్దరి డ్యూటీనూ చెబుతున్నాను -జాగర్తగా వినండి. నువ్వు ఈ పిస్టల్ పట్టుకుని, ఓ గుమ్మం ద్వారా క్లాసులోకి ప్రవేశించి, అందరికీ పిస్టల్ చూపించి బెదిరిస్తూ, ఎవ్వరూ కదలొద్దని హెచ్చరిస్తావు. వీడు నాతో బాటే మరో గుమ్మం ద్వారా పెట్రోల్ డబ్బాలతోనూ, యాసిడ్ సీసాలతోనూ లోపల కొస్తాడు. మనం ఎంత సాహసానికి దిగుతామో ఊహించని సరస్వతి మళ్ళీ మందలింపులు ప్రారంభించి, 'గెటవుట్' అంటుంది. నేనూ, వీడూ అమాంతం దాని మీదకు ఉరికి, పెట్రోలు, యాసిడ్ దాని మీద గుమ్మరించి... అగ్గి పుల్ల గీసి, దాని మీద వేసి, అది చావు కేకలు పెడుతూ ... కాలి బూడిద అయిపోతోంటే,... నేను కసి తీరా పగలబడి నవ్వుతూ........" అంటూ విరగబడి నవ్వుతూ, స్నేహితులను కూడా ఉత్సాహ పరిచేసరికి, వాళ్ళు కూడా చేయబోయే ఘనకార్యాన్ని తలుచుకుని పగలబడి నవ్వుతూ... నవ్వుతూ... నవ్వుతూ.... గబాలున తెరచుకున్న తలుపుల వెనక - గుమ్మానికి అడ్డంగా నిలువెత్తునా నిలుచున్న వ్యక్తిని చూసి, ఖంగుతిన్నారు !

ఆ వ్యక్తి కళ్ళు చీకట్లో విస్ఫులింగాల్లా మెరుస్తున్నాయి.

గిట్టకరుచుకుని ఉన్న ఆ వ్యక్తి దవడలు అదురుతున్నాయి.

మనిషి నిలువునా పట్టరాని కోపంతో ఒణికిపోతున్నాడు.

ఆ వ్యక్తి ఎవరో కాదు - శాస్త్రిగారు !

"నాన్నా - నువ్వెందు కొచ్చా విక్కడికి?" అరిచాడు నాగరాజు.

శాస్త్రిగారు సమాధానం మాటల్తో చెప్పలేదు - ఒళ్ళు తెలియని ఆవేశంతో, గుమ్మం ప్రక్కనే ఉన్న యాసిడ్ బాటిల్స్‌ని వాళ్ళున్న గది లోపల నేలమీదకు విసిరి పగలగొట్టారు. డబ్బాల్లోని పెట్రోల్‌ని గది లోపలికి వంచి, తలుపుల మీద కూడా పోశారు. అదిరిపడ్డ నాగరాజు, వాడి స్నేహితులూ కంగారుగా "ఏవిటి మీరు చేస్తున్నదీ?" అని అంటూండగానే అగ్గి పుల్ల గీసి, లోపలికి విసిరి, తలుపులు దగ్గరగా లాగి గొళ్లెం పెట్టారు...

రెప్పపాటులో మంటలు ఉవ్వెత్తున్న లేచాయి.

లోపల ముగ్గురూ భయంతో గంతులేస్తూ అరుస్తున్నారు.

వెనక్కి జరిగారు శాస్త్రిగారు...

యాంత్రికంగా వెనకడుగులు వేస్తూ దూరంగా జరిగి, తులసి మొక్క ప్రక్కనే పద్మాసనం వేసుకుని కూర్చుని, కంపిస్తూన్న శరీరాన్నీ, చంచలిస్తూన్న మనస్సునీ అదుపులోకి తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తూ, మూడో కన్ను తెరచిన విశ్వేశ్వరుడిలా ప్రజ్వలించి పోతూ, కళ్ళు నిగిడ్చి, మంటల్నే చూస్తున్నారు...

ఎదురుగా...

పాతిక సంవత్సరాల క్రితం పెరట్లో ఉన్న వందగజాల స్థలంలో స్వయంగా నిర్మించుకున్న పర్ణశాల. ఈనాడు అది దగ్ధమైపోతోంది. అందులో తను అనేకగ్రంథాలు వ్రాశాడు. అనేకమంది విద్యార్థులకి వేదం నేర్పాడు. ఎందరో పండితులకి విడిదిగా వినియోగించాడు. ఈనాడు అది అపవిత్రమైపోయింది...

లోపల్నుంచి బయటపడేమార్గంలేక, పొగలో ఉక్కిరి బిక్కిరి అయిపోతూ, మంటల వేడికితాళలేక, ఉన్న ఒంటి గుమ్మం గుండా బయటపడే అవకాశం లేక, భయంకరంగా కేకలు పెడ్తున్నారు ముగ్గురూ... బూతులు తిడ్తున్నాడు నాగరాజు.. బెదిరిస్తున్నాడు...

శాస్త్రిగారిలో చలనం లేదు...

మంటలు ఆప్యాయంగా కౌగలించుకోవడానికి ముగ్గురికీ దగ్గరవుతున్నాయి...

లోపల గోల... ఏడుపు స్వరంతో అరుపులు...

శాస్త్రిగారిలో చలనం లేదు...

పర్ణశాల లోపల ఉన్న చెక్కసామాను, పుస్తకాలూ కూడా అంటుకున్నాయి. ఉవ్వెత్తున లేస్తూన్న మంటలు పై కప్పుని అందుకోవాలని ఉబలాటపడ్తున్నాయి...

లోపల ఏడుపులు... కడుపు చించుకుని అరుపులు...

శాస్త్రిగారిలో చలనం లేదు...

పై కప్పు అంటుకుంది... నాలుకలు చాస్తూ మంటలు పాకుతున్నాయి.

దగ్గరయి, చుట్టుముట్టిన మంటల్ని చూస్తూనే నాగరాజు భయంతో కంపించి పోయాడు. వెంటనే, నాభి దగ్గర ప్రారంభమై గొంతుగుండా వచ్చింది ఆర్తనాదం, "నాన్నా - నాది తప్పే నాన్నా ! ఇంకెప్పుడు దుర్మార్గంగా ప్రవర్తించను నాన్నా! సరస్వతీ మేడం కాళ్ళు పట్టుకుంటాను నాన్నా ! నన్ను రక్షించునాన్నా ! మంటల్లో కాలిపోతున్నాను నాన్నా !..."

శాస్త్రిగారి మనస్సు క్షణకాం చలించింది.

అంతలోనే అదుపు చేసుకోవడానికి ప్రయత్నిస్తూ "ఎప్పుడో నేను చస్తే నా తలకి నిప్పు పెట్టే వాడివి నువ్వే - నన్ను పున్నామ నరకం నుంచి తప్పించే వాడివి ను వ్వొక్కడివే అనే సంకుచిత మనస్తత్వంతో ఇన్నేళ్ళుగా నీ దుర్మార్గాన్ని సహిస్తూ వచ్చానురా. కానీ... ఈనాడు నా చేతుల్తోనే నీకు నిప్పు పెట్టే దౌర్భాగ్యాన్ని నాకు కలిగించావురా !...." అంటూ దు ఃఖానికి లొంగారు.

పర్ణశాల పై కప్పు పూర్తిగా అంటుకుంది. చూస్తూండగానే కుప్పకూలిపోయింది. లోపలముగ్గురూ ఆఖరు సారిగా భయంకరంగా అరిచారు... మరో రెండు నిముషాలకి అంత నిశ్శబ్దం. కాలిపోయిన పర్ణశాలలో ఎన్నో గ్రంథాలు... మసి అయిపోయి ! ఎన్నో సన్మానపత్రాలు... నుగ్గయిపోయి ! మూడు శవాలు... బొగ్గయిపోయి !

పర్ణశాలని మొండిగోడలుగా మిగిల్చి మంటలు శాంతిస్తూండగా,తను చేసిన పనిని మనసా వాచా సమర్థించుకుంటూ నిశ్చలంగా, నిబ్బరంగా, స్వగతంగా పలికారు. 'సమాజానికీ, సరస్వతికీ నిప్పు పెట్టే ఓ దుర్మార్గుడికీ - స్వంత కొడుకుని సమాజానికి ఓ సుగంధ పుష్పంలా సమర్పించలేని నా పాండిత్యానికీ - నిప్పు పెట్టడమే నా కర్తవ్యం...'

మంటలతో బాటే ఆయన గుండెలూ చల్లబడుతున్నాయి. ★

